


## పంగల్ పునరాగమనం

**ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీకి ఎంపిక**

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించేందుకు ఆఖరిదైన ఒలింపిక్ క్వాలిఫయిర్స్ టోర్నీ కోసం జాతీయ బాక్సింగ్ సమాఖ్య(బీఎఫ్‌ఐ) శనివారం మొత్తం తొమ్మిది మందితో కూడిన జట్టును ప్రకటించింది. ఇందులో ఏడుగురు పురుష బాక్సర్లతో పాటు ఇద్దరు మహిళా బాక్సర్లు ఉన్నారు. బ్యాంకాక్ వేదికగా మే 25వ తేదీ నుంచి జూన్ 2 వరకు జరిగే ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీలో వీరు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. గత నెలలో ఇటలీలో జరిగిన క్వాలిఫయింగ్ టోర్నీలో భారత బాక్సర్లు పేలవ ప్రదర్శన కనబరుస్తూ విశ్వక్రీడలకు బెర్తులు దక్కించుకోవడంలో విఫలమయ్యారు. ఆఖరి అర్హత టోర్నీలోనైనా ఆకట్టుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది. ఇదిలా ఉంటే జట్టులో పలు మార్పులు చేశారు. తెలంగాణ యువ బాక్సర్ మహమ్మద్ హుసాముద్దీన్(57కి) చోటు దక్కలేదు. వీరి స్థానాల్లో సచిన్ సివాచ్(57కి), అభినాశ్ జమ్వాల్ (63.5కి), నిశాంత్‌దేవ్(71కి), అభిమన్యు(80కి), నరేందర్ బెర్వాల్(92కి), అంక్షిత(60కి), అరుంధతి(66కి) అవకాశం కల్పించారు.

**ఉత్కంఠ పోరులో రాజస్థాన్ గెలుపు**

# రాయల్స్ పంజా

**సమిష్టి ప్రదర్శనతో అగ్రస్థానంలో • చేజేతులా ఓటమిపాలైన పంజాబ్**



ఐపీఎల్‌లో మరో మ్యాచ్ అభిమానులను కట్టిపడేసింది! బంతి బంతికి ఉత్కంఠ రేపుతూ ఆఖరి గెలుపు దోబూచులాడిన పోరులో పంజాబ్‌కింగ్స్‌పై రాజస్థాన్ రాయల్స్‌దే పైచేయి అయ్యింది. 148 పరుగుల లక్ష్యఛేదనలో పడుతూ లేస్తూ సాగిన రాజస్థాన్ సమిష్టి ప్రదర్శన కనబరుస్తూ కింగ్స్‌పై దిమ్మతిరిగే రీతిలో పంజా విసిరింది. జైస్వాల్, తనుశ్ మోస్తారు శుభారంభంతో ఇన్నింగ్స్ మొదలుపెట్టిన రాజస్థాన్..పంజాబ్ బౌలింగ్ ధాటికి వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. ఆఖర్లో హెట్‌మైర్ వీరవిహారంతో రాయల్స్ గెలుపు సంబురాల్లో నిలువగా, పంజాబ్‌కు మరోమారు సొంత ఇలాఖాలో నిరాశే ఎదురైంది. అవేశ్‌ఖాన్, కేశవ్‌మహారాజ్ సూపర్ బౌలింగ్‌తో పంజాబ్‌ను తక్కువ స్కోరుకే కట్టడి చేశారు.

ముల్లాన్‌పూర్: సొంత ఇలాఖాలో పంజాబ్ కింగ్స్‌కు మరో పరాభవం. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో గత మ్యాచ్‌ను తలపిస్తూ రాజస్థాన్‌తో పోరులో పంజాబ్ గెలిచే పరిస్థితుల్లో నుంచి ఓటమి వైపు నిలిచింది. శనివారం అభిమానులకు పసందైన విందు అందించిన మ్యాచ్‌లో టేబుల్ టాపర్ రాజస్థాన్ రాయల్స్ 3 వికెట్ల తేడాతో పంజాబ్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. దీంతో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఐదు విజయాలతో రాయల్స్ 10 పాయింట్లతో టాప్‌గేర్‌లో దూసుకెళుతుంటే..నిలకడలేమికి కేరాఫ్‌గా నిలుస్తూ పంజాబ్ నాలుగు పాయింట్లతో ఎనిమిదో స్థానంలో కొట్టుమిట్టాడుతున్నది. తొలుత కేశవ్ మహారాజ్(2/23), అవేశ్‌ఖాన్(2/34) ధాటికి పంజాబ్ 20 ఓవర్లలో 147/8 స్కోరు చేసింది. 103 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన దశలో ఆఖర్లో అశుతోష్‌శర్మ(16 బంతుల్లో 31, ఫోర్, 3 సిక్స్‌లు) ధనాధన్ ఇన్నింగ్స్‌తో గౌరవప్రదమైన స్కోరు దక్కించుకుంది. ఆ తర్వాత లక్ష్యఛేదనకు దిగిన రాయల్స్..19.5 ఓవర్లలో 152/7 స్కోరు చేసింది. యశస్విజైస్వాల్(39), హెట్‌మైర్(10 బంతుల్లో 27 నాటౌట్, ఫోర్, 3సిక్స్‌లు) మెరుగ్గా రాణించారు. రబాడ(2/18), సామ్ కరాన్(2/25) రెండేసి వికెట్లు తీశారు. హెట్‌మైర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

**పంజాబ్ పడుతూ లేస్తూ:** టాస్‌గెలిచిన రాజస్థాన్..పంజాబ్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. రెగ్యులర్ కెప్టెన్ శిఖర్ ధవన్ గాయం కారణంగా మ్యాచ్‌కు దూరం కాగా, అతని స్థానంలో అతర్వ తైదే(15) వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఈ మ్యాచ్‌లోనైనా బ్యాటు ఝులిపిస్తాడనుకున్న జానీ బెయిర్‌స్టో(15) మరోమారు నిరాశ పరిచాడు. వీరిద్దరు కలిసి తొలి వికెట్‌కు 27 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. ఇంప్యాక్ట్ ప్లేయర్‌గా వచ్చిన ప్రభ్‌సిమ్రన్‌సింగ్(10) స్వల్ప స్కోరుకే పరిమితం కాగా, తాత్కాలిక కెప్టెన్ సామ్ కరాన్(6) తీవ్రంగా నిరాశపరిచాడు. లీగ్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న సఫారీ స్టార్ స్పిన్నర్ కేశవ్ మహారాజ్..బెయిర్‌స్టో, కరాన్‌ను ఔట్ చేసి పంజాబ్‌ను కోలుకోలేని దెబ్బతీశాడు. భారీ ఆశలు పెట్టుకున్న జితేశ్‌శర్మ(29) అంతో ఇంతో బ్యాటు ఝులిపించాడు. లివింగ్‌స్టోన్(21)తో కలిసి పంజాబ్ ఇన్నింగ్స్‌ను నిలబెట్టాడు. అవేశ్‌ఖాన్ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్లో జితేశ్ ఔట్ కావడంతో ఆరో వికెట్‌కు 33 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్‌పడింది. గత మ్యాచ్‌ల్లో దుమ్మురేపిన శశాంక్‌సింగ్ (9) ఈసారి సింగిల్ డిజిట్‌కు పరిమితమయ్యాడు. ఆఖర్లో అశుతోష్‌శర్మ మూడు భారీ సిక్స్‌లు, ఫోర్‌తో చెలరేగడంతో పంజాబ్ పరువు దక్కించుకోగ్లింది. లేకపోతే 120లోపే చాపచుట్టేసేది.

**హెట్‌మైర్ హిట్:** పంజాబ్ నిర్దేశించిన లక్ష్యఛేదనలో రాజస్థాన్‌కు ఓపెనర్లు యశస్వి జైస్వాల్(39), తనుశ్ కొటియాన్(24) ఒకింత మెరుగైన శుభారంభం అందించారు. లివింగ్‌స్టోన్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయిన తనుశ్ ఔట్ కావడంతో తొలి వికెట్‌కు 56 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్‌పడింది. ఆ తర్వాత వచ్చిన కెప్టెన్ శాంసన్(18)..జైస్వాల్‌కు జతకలిశాడు. ఈ సీజన్‌లో పేలవ ప్రదర్శన కనబరుస్తున్న జైస్వాల్..ఈ పోరులో ఆకట్టుకున్నాడు. రబాడ బౌలింగ్‌లో షాట్ కోసం ప్రయత్నించిన జైస్వాల్..హర్షల్ పటేల్ క్యాచ్‌తో రెండో వికెట్‌గా వెనుదిరిగాడు. మరోమారు బౌలింగ్‌కు దిగిన రబాడ..ఈసారి శాంసన్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఆదుకుంటాడనుకున్న రియాన్ పరాగ్(23), ధృవ్ జురెల్(6) వెంటవెంటనే ఔటయ్యారు. దీంతో పంజాబ్ గెలుపుపై ఆశలు చెలరేగాయి. అయితే చివరి ఓవర్లో విజయానికి 10 పరుగులు అవసరమైన దశలో మొదటి రెండు బంతుల్లో పరుగులు చేయని హెట్‌మైర్ రెండు భారీ సిక్స్‌లతో మ్యాచ్‌కు తనదైన శైలిలో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు.

**సంక్షిప్తస్కోర్లు:** **పంజాబ్:** 20 ఓవర్లలో 147/8 (అశుతోష్ 31, జితేశ్ 29, మహారాజ్ 2/23, అవేశ్ 2/34), **రాజస్థాన్:** 19.5 ఓవర్లలో 152/7(జైస్వాల్ 39, హెట్‌మైర్ 27 నాటౌట్, రబాడ 2/18, కరాన్ 2/25)

## 6 బంతుల్లో సిక్సర్లు

**నేపాల్ క్రికెటర్ దీపేంద్ర రికార్డు ఫీట్ యువరాజ్‌సింగ్, పొలార్డ్ సరసన**



దీపేంద్ర (64 నాటౌట్)

అల్ అమెరాత్(ఖతార్): టీ20 క్రికెట్‌లో మరో సంచలనం! అసాధ్యాన్ని సుసాధ్యం చేస్తూ క్రికెట్ పసికూన నేపాల్ తమ సత్తాఏంటో ప్రపంచానికి చూపెట్టింది. ఏసీసీ ప్రీమియర్ కప్ టీ20 ఇంటర్నేషనల్ టోర్నీలో భాగంగా ఖతారతో శనివారం జరిగిన మ్యాచ్‌లో నేపాల్ హార్డ్‌హిట్టర్ దీపేంద్రసింగ్ ఐరీ (21బంతుల్లో 64 నాటౌట్)ఆరు బంతుల్లో ఆరు సిక్స్‌లతో దుమ్మురేపాడు. ఖతార్ బౌలర్ కమ్రాన్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో దీపేంద్ర ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అప్పటి వరకు 15 బంతుల్లో 28 పరుగులు చేసిన ఈ యువ క్రికెటర్..కమ్రాన్ ఆరు బంతులను ఆరు సిక్స్‌లుగా మలిచి అద్భుతం చేశాడు. బంతి పిచ్‌పై పడితే ఆలస్యం..ఆకలిగొన్న పులిలా వేటాడిన దీపేంద్ర బౌండరీ బయటకు పంపాడు. ఈ క్రమంలో అంతర్జాతీయ టీ20ల్లో ఈ ఫీట్ సాధించిన మూడో క్రికెటర్‌గా భారత దిగ్గజ క్రికెటర్ యువరాజ్‌సింగ్‌తో పాటు కీరన్ పొలార్డ్ సరసన చేరాడు. దీపేంద్ర దంచుడుతో నేపాల్ నిర్ణీత 20 ఓవర్లలో 210/7 స్కోరు చేసింది. ఆ తర్వాత లక్ష్యఛేదనలో ఖతార్ 178/9 స్కోరుకు పరిమితమైంది. బ్యాటింగ్‌లో దుమ్మురేపిన దీపేంద్ర.. బౌలింగ్‌లోనూ రెండు వికెట్లు తీసి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. అన్నట్లు ఈ మ్యాచ్‌లో నేపాల్ 32 పరుగులతో గెలిచింది.

### టీ20ల్లో సిక్సర్ల వీరులు

1) యువరాజ్‌సింగ్-దక్షిణాఫ్రికాపై (2007)
2) కీరన్ పొలార్డ్-శ్రీలంకపై (2021)
3) దీపేంద్రసింగ్-ఖతార్‌పై (2024)

**ఐపీఎల్ ముచ్చట్లు**

## స్వదేశానికి మిచెల్ మార్ష్



న్యూఢిల్లీ: లీగ్‌లో ఇప్పటికే పడుతూ లేస్తూ సాగుతున్న ఢిల్లీ క్యాపిటల్స్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. తొడ కండరాల గాయానికి చికిత్స కోసం స్టార్ ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ స్వదేశం ఆస్ట్రేలియాకు బయల్దేరి వెళ్లాడు. దీంతో లీగ్‌లో మిగిలిన మ్యాచ్‌లకు మార్ష్ అందుబాటులో ఉంటాడా లేదా అన్నది అనుమానంగా మారింది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఈ నెల 3న చివరి మ్యాచ్ ఆడిన మార్ష్ రిజర్వ్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. ఇదిలా ఉంటే జూన్‌లో జరిగే టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా జట్టుకు మార్ష్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఢిల్లీ క్యాపిటల్స్‌తో చర్చించిన తర్వాతే మిచెల్ స్వదేశానికి పయనమైనట్లు తెలిసింది.

## భారత్ వైట్‌వాష్

**5-0తో హాకీ సిరీస్ ఆసీస్ కైవసం**



పెర్త్: ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు ముందు భారత హాకీ జట్టు పేలవ ప్రదర్శన కొనసాగుతున్నది. ఆస్ట్రేలియాతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 0-5తో వైట్‌వాష్ ఎదుర్కొంది. శనివారం జరిగిన సిరీస్‌లో చివరిదైన ఐదో పోరులో టీమ్‌ఇండియా 2-3 తేడాతో ఆసీస్ చేతిలో ఓటమిపాలైంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌సింగ్(4ని), బాబీసింగ్ ధామి(53ని) భారత్ తరఫున గోల్స్ చేయగా, జెరెమీ హేవర్డ్(20ని), విల్లాట్(38ని), టిమ్‌బ్రాండ్(39ని) ఆసీస్‌కు గోల్స్ అందించారు.

## భారత్ టైటిల్ వేట

**క్యాండిడేట్స్ చెస్ టోర్నీ**

టొరంటో: క్యాండిడేట్స్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ల టైటిల్ వేట కొనసాగుతున్నది. ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తూ మన యువ ప్లేయర్లు ముందుకు సాగుతున్నారు. టోర్నీలో ఏడు రౌండ్లు ముగిసే సరికి ప్రజ్ఞానంద(4), గుకేశ్(4), విదిత్ గుజరాతీ(3.5) మెరుగైన ప్రదర్శనతో టైటిల్‌ను దక్కించుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఇయాన్ నెపోమియాచి(4.5) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఎనిమిదో రౌండ్‌లో ఫిరౌజ అలీరెజాతో ప్రజ్ఞానంద, గుకేశ్‌తో విదిత్ తలపడనున్నారు.

### పాయింట్ల పట్టిక

| జ | ఆ | గె | ఓ | ర | పా |
|---|---|---|---|---|---|
| రాజస్థాన్ | 6 | 5 | 1 | 0.76 | 10 |
| కోల్‌కతా | 4 | 3 | 1 | 1.52 | 6 |
| చెన్నై | 5 | 3 | 2 | 0.66 | 6 |
| లక్నో | 5 | 3 | 2 | 0.43 | 6 |
| హైదరాబాద్ | 5 | 3 | 2 | 0.34 | 6 |
| గుజరాత్ | 6 | 3 | 3 | -0.63 | 6 |
| ముంబై | 5 | 2 | 3 | -0.07 | 4 |
| పంజాబ్ | 6 | 2 | 4 | -0.21 | 4 |
| ఢిల్లీ | 6 | 2 | 4 | -0.97 | 4 |
| బెంగళూరు | 6 | 1 | 5 | -1.12 | 2 |

నోట్: జ:జట్లు, ఆ: ఆడినవి, గె: గెలిచినవి, ఓ: ఓడినవి, ర:రన్‌రేట్, పా:పాయింట్లు

## శ్రీనిధి ఉత్కంఠ విజయం

**ఐ-లీగ్ ఫుట్‌బాల్ టోర్నీ**



హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక ఐ-లీగ్ టోర్నీని శ్రీనిధి దక్కన్ ఫుట్‌బాల్ క్లబ్(ఎస్‌డీఎఫ్‌సీ) ఘనంగా ముగించింది. శనివారం దక్కన్ ఎరీనాలో జరిగిన లీగ్ చివరి మ్యాచ్‌లో శ్రీనిధి ఎఫ్‌సీ 3-2తో షిల్లాంగ్ లాజాంగ్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన పోరులో శ్రీనిధి తరఫున విలియమ్ అల్వెస్(4ని), రొసెన్‌బర్గ్ గాబ్రియెల్(16ని), డేవిడ్ కాస్టెండా(84ని) గోల్స్ చేశారు. మరోవైపు ఫ్రాంగ్కి బూమ్(46ని, 87ని) డబుల్ గోల్స్‌తో ఆకట్టుకున్నాడు. లీగ్‌లో మొత్తంగా 24 మ్యాచ్‌లాడిన శ్రీనిధి 14 విజయాలు, 6 డ్రా, 4 ఓటములతో 48 పాయింట్లతో మొహమ్మడీన్(52) తర్వాత రెండో స్థానంలో నిలిచింది. గోకులం కేరళ(42)కు మూడో స్థానం దక్కింది.

## రాధికకు రజతం

**ఏషియన్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్**



బిష్కెక్(కిర్గిస్థాన్): అండర్-23 ఏషియన్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్ల అద్భుత ప్రదర్శన కొనసాగుతున్నది. శనివారం జరిగిన మహిళల 68కిలోల విభాగంలో రాధిక రజత పతకంతో మెరిసింది. హోరాహోరీగా సాగిన తుది పోరులో రాధిక..జపాన్ రెజ్లర్ నోనొక ఔజాకి చేతిలో ఓటమిపాలైంది. టెక్నికల్ సుపీరియారిటీలో నోనొక ఆధిక్యం కనబరిచింది. మరోవైపు 50కిలోల కాంస్య పతక పోరులో శివానీ 9-7తో ఒట్గోజార్గల్ దోల్గోర్జావ్(మంగోలియా)పై గెలిచింది. వేర్వేరు కాంస్య పతక బౌట్‌లలో తమన్నా(55కి), పుష్పా యాదవ్(59కి) ప్రత్యర్థుల చేతిలో ఓడి కాంస్య పతకాలను చేజార్చుకున్నారు.

## ఎట్టకేలకు దిగొచ్చిన బంగారం

**తులంపై రూ.760 తగ్గుదల**

హైదరాబాద్, ఏప్రిల్ 13: బంగారం ధరలు ఎట్టకేలకు శాంతించాయి. రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతున్న పుత్తడి ధర శనివారం దిగొచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ పడిపోవడం, అమెరికా ద్రవ్యోల్బణం భారీగా పెరగడంతో జూన్ సమీక్షలోనే ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను తగ్గించే అవకాశాలు ఉండటంతో రికార్డు స్థాయికి చేరుకున్న ధరలు తగ్గుముఖం పట్టాయి. అధిక ధరల కారణంగా దేశీయంగా కొనుగోళ్లు పూర్తిగా నిలిచిపోవడం కూడా ధరలు తగ్గడానికి ప్రధాన కారణమని బులియన్ వర్తకులు వెల్లడిస్తున్నాయి. దీంతో హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 22 క్యారెట్ తులం బంగారం ధర రూ.700 దిగొచ్చి రూ. 67,200 నుంచి రూ. 66,500కి తగ్గింది. అలాగే 24 క్యారెట్ తులం బంగారం ధర రూ.760 తగ్గి రూ.73 వేల దిగువకు పడిపోయింది. చివరకు బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి తులం పుత్తడి ధర రూ.72,550కి తగ్గింది. పసిడితోపాటు వెండి ధరలు భారీగా తగ్గాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ పడిపోవడంతో కిలో వెండి రూ.1,000 తగ్గి రూ. 90 వేల మార్క్ నుంచి రూ.89 వేలకు దిగొచ్చింది.





## ఫోక్స్‌వ్యాగన్ టైగూన్‌పై భారీ రాయితీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: ఫోక్స్‌వ్యాగన్..ఎస్‌యూవీ మాడల్ టైగూన్ ధరను రూ.1.10 లక్షల వరకు తగ్గించింది. స్వల్ప కాలంపాటు ఈ ధరలు అమలులో ఉండనున్నాయని పేర్కొంది. దీంతో 1.0లీటర్ ఎంటీ రకం రూ.11.70 లక్షల నుంచి రూ.11 లక్షలకు ధరను తగ్గించింది. అలాగే జీటీ ప్లస్ ధరను రూ.75 వేలు, జీటీ ప్లస్ క్రోమ్ డీఎస్‌జీ మాడల్ ధరను రూ.1.05 లక్షలు కోత పెట్టింది. దీంతో కారు ధర రూ.11 లక్షల నుంచి రూ.18.90 లక్షల మధ్యలోకి చేరుకున్నది. ఈ నెలలోనే హ్యుందాయ్ క్రెటా, కియా సెల్టోస్ మాడళ్లను ధరలను తగ్గించినది తెలిసిందే.

## మారుతి కార్లపై భారీ డిస్కౌంట్లు

**పలు మాడళ్లపై రూ.1.5 లక్షల వరకు రాయితీ**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ పలు మాడళ్లపై రాయితీని ప్రకటించింది. ప్రస్తుత నెలకుగాను బాలెనో, ఫ్రాంక్స్, జిమ్నీలతో పాటు ఇతర మాడళ్లపై రూ.1.5 లక్షల వరకు రాయితీకి విక్రయిస్తున్నది. వీటితోపాటు ఎక్స్‌ఎల్‌ఆర్, ఇగ్నిస్, గ్రాండ్ విటారా మిల్డ్ హైబ్రిడ్, టర్బో-పెట్రోల్ రకం ఫ్రాంక్స్‌పై ఈ రాయితీని ఇస్తున్నట్లు తెలిపింది. నూతన ఆర్థిక సంవత్సరం తొలి నెలలో ఈ డిస్కౌంట్లు అందుబాటులో ఉండనున్నాయని పేర్కొంది. వీటిలో నగదు డిస్కౌంట్లు, ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ డిస్కౌంట్ రూపంలో సంస్థ ఇస్తున్నది. ఇటీవల మార్కెట్లోకి విడుదల చేసిన ఎక్స్‌ఎల్6, ఫ్లాగ్‌షిప్ ఇన్విక్టో ఎంపీవీ మాడళ్లకు ఈ రాయితీలు వర్తించవని పేర్కొంది.

**మారుతి ఇగ్నీస్:** ఇగ్నీస్ మాడల్‌ను కొనుగోలు చేయాలనుకుంటున్నారా అయితే మీకు రూ.58 వేల వరకు తక్కువ ధరకే లభించనున్నది. వీటిలో నగదు రూపంలో రూ.40 వేలు తగ్గనుండగా, ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.15 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ కింద మరో రూ.3 వేలు తక్కువకానున్నాయి.

**బాలెనో:** మార్కెట్లో ప్రజాదరణ పొందిన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ బాలెనోపై రూ.35 వేలు నగదు డిస్కౌంట్ లభించనుండగా, ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.15 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ కింద రూ.3 వేలు లభించనున్నాయి.

**సియాజ్:** మల్టీపర్పస్ మాడలైన సియాజ్‌పై రూ.53 వేలు రాయితీ ఇస్తున్నది. వీటిలో రూ.25 వేలు ధరను తగ్గించనుండగా, ఎక్స్ఛేంజ్ బోనస్ కింద మరో రూ.25 వేలు, కార్పొరేట్ డిస్కౌంట్ కింద మరో రూ.3వేలు డిస్కౌంటు

**గ్రాండ్ విటారా:** నగదు డిస్కౌంట్లు, ఎక్స్ఛేంజ్ బోనస్, కార్పొరేట్ డిస్కౌంట్లు కలుపుకొని రూ.84 వేల వరకు తగ్గిస్తున్నది.

### వాణిజ్య



## హెచ్‌పీ గేమింగ్ ల్యాప్‌టాప్‌లు

**ప్రారంభ ధర రూ.1.74 లక్షలు**

హైదరాబాద్, ఏప్రిల్ 13: కృత్రిమ మేధస్సుతో అనుసంధానమైన ల్యాప్‌టాప్‌లను దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది హెచ్‌పీ. ఇంటెల్-కోర్-అల్ట్రా ప్రాసెసర్ కలిగిన ఒమెనన్ ట్రాన్సెండ్ 14 కలిగిన ఈ గేమింగ్ ల్యాప్‌టాప్ పాతవాటితో పోలిస్తే 65 శాతం అధికంగా బ్యాటరీ లైఫ్ ఇవ్వనున్నది. అలాగే ఏఐ ఫీచర్స్ కలిగిన ఎన్వీ ఎక్స్360 14 అంగుళాల కలిగిన ఈ ల్యాప్‌టాప్ 1.637 కిలోల బరువు కలిగివున్నది. బ్యాటరీ లైఫ్ 11.5 గంటలు రానున్నది. రెండు కలర్స్‌లో లభించనున్న హెచ్‌పీ ఒమెన్ ట్రాన్సెండ్ ధర రూ.1,74,999గాను, మరో మాడల్ ధరను రూ. 99,999గా నిర్ణయించింది.

## గ్రాన్యూల్స్ వైజాగ్ ప్లాంట్ అమెరికా తనిఖీలు

హైదరాబాద్, ఏప్రిల్ 13: గ్రాన్యూల్స్ ఇండియాకు చెందిన ప్లాంట్లో అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్‌డీఏ) ఉన్నతాధికారులు తనిఖీలు చేశారు. విశాఖపట్నంలో ఉన్న ప్లాంట్‌ను ఈ నెల 8 నుంచి 12 వరకు తనిఖీలు చేసి జీరో 483 అబ్జర్వేషన్ ఇచ్చింది. ఈ ప్లాంట్లో ఏపీఐఎస్, ఫార్ములేషన్‌కు సంబంధించిన పలు ఔషధాలు తయారు చేస్తున్నది సంస్థ. ఈ సందర్భంగా కంపెనీ సీఎండీ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ..అమెరికా ఎఫ్‌డీఏ ఆడిట్స్ నిర్వహించిన తనిఖీలో ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేయకపోవడం విశేషమని, అంతర్జాతీయ ప్రమాణాలకు తగ్గట్టుగా గ్లోబల్ జనరిక్ ఔషధాలను తయారు చేస్తున్నట్లు తెలిపారు.

## మెఘా ఇంజినీరింగ్‌పై లంచం కేసు

**పెండింగ్ బిల్లులకోసం 78 లక్షల ముడుపులు**

హైదరాబాద్, ఏప్రిల్ 13: రాష్ర్టానికి చెందిన ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ మెఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్‌కు సీబీఐ గట్టి షాకిచ్చింది. పెండింగ్ బిల్లుల చెల్లింపునకు సంబంధించి లంచం ఇచ్చినట్లు రుజువుకావడంతో సీబీఐ శనివారం కేసు నమోదు చేసింది. ఎన్‌ఐఎస్‌పీ, ఎన్‌ఎండీసీకి చెందిన ఎనిమిది మంది ఉన్నతాధికారులతోపాటు మెకాన్‌కు చెందిన ఇద్దరు అధికారులపై ఎఫ్‌ఐఆర్‌ను దాఖలు చేసింది. జగ్‌దాల్‌పూర్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌నకు సంబంధించి రూ.174 కోట్ల పెండింగ్ బిల్లుల కోసం మెఘా ఇంజినీరింగ్ అధికారులు రూ.78 లక్షల మేర లంచం ఇచ్చినట్లు తేలింది. ఈ కేసును ఆగస్టు 10, 2023 నుంచి విచారణ చేపట్టిన సీబీఐ..శనివారం ఎనిమిది మంది అధికారులపై ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసింది. వీరిలో ఎన్‌ఐఎస్‌పీ, ఎన్‌ఎండీసీకి చెందిన పదవీ విరమణ చేసిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రశాంత్ దాశ్, డైరెక్టర్(ప్రొడక్షన్) డీకే మోహంతీ, డీజీఎం పీకే భూయాన్, డీఎం నరేశ్ బాబు, సీనియర్ మేనేజర్ సుబ్రో బెనర్జీ, రిటైర్డ్ సీజీఎం(ఫైనాన్స్) ఎల్ కృష్ణ మోహన్, జీఎం(ఫైనాన్స్) కే రాజశేఖర్, మేనేజర్(ఫైనాన్స్) సోమ్‌నాథ్ ఘోష్‌లు లంచం రూపంలో రూ.73.85 లక్షలు అందుకున్నారు. వీరితోపాటు మెకాన్ లిమిటెడ్ ఏజీఎం(కాంట్రాక్ట్స్) సంజీవ్ సహాయ్, డీజీఎం(కాంట్రాక్ట్స్) కే ఇల్లావార్స్‌లు కూడా రూ.5. లక్షల లంచం పొందారు. ఎన్‌ఎండీసీ ఐరన్ అండ్ స్టీల్ ప్లాంట్ ప్రాజెక్టునకు సంబంధించి రూ.315 కోట్ల ప్రాజెక్టు అమలులో అవినీతికి పాల్పడ్డారనే అభియోగాలపై గతేడాదిలోనే కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

## భారత్‌లో డామ్సన్ ప్లాంట్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 13: లైఫ్‌స్టైల్, మొబైల్ విడిభాగాల తయారీ సంస్థ డామ్సన్ టెక్నాలజీ..భారత్‌లో ప్లాంట్‌ను ఏర్పాటు చేసేయోచనలో ఉన్నది. చైనాలోని బీజింగ్ వద్ద ఉన్న ప్లాంట్లో తయారవుతున్న ఉత్పత్తుల్లో సగం భారత్‌లో తయారు చేయడానికి ఇక్కడ ప్లాంట్‌ను నెలకొల్పాలనుకుంటున్నట్లు కంపెనీ ఎండీ రితేష్ గోయెంకా తెలిపారు. ఇందుకోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.150 కోట్ల మేర పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించారు. భారత్‌లో ఎక్కడ ఏర్పాటు చేసే విషయంపై ఇంకా స్పష్టత రాలేదని, ఈ ఏడాదిచివరినాటికి కొలిక్కి వచ్చే అవకాశం ఉన్నదన్నారు. కంపెనీకి రానున్న రూ.1,000 కోట్ల ఆదాయంలో సగం రూ.500 కోట్లు భారత్ నుంచి రానున్నదని తెలిపారు.

## జీసీసీ అడ్డాగా భారత్

చెన్నై, ఏప్రిల్ 13: గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్(జీసీసీ) అడ్డాగా భారత్ మారిపోతున్నది. అంతర్జాతీయ టెక్నాలజీ సంస్థలు ఇక్కడే జీసీసీలను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతున్నాయని బిజినెస్ కన్సల్టింగ్ కంపెనీ ఏఎన్‌ఎస్‌ఆర్ సర్వే వెల్లడించింది. ఇప్పటికే ఏఎన్‌ఎస్‌ఆర్..110 జీసీసీలను 1.2 కోట్ల చదరపు అడుగుల విస్తీర్ణ స్థలంలో ఏర్పాటు చేసింది. వీటిలో 1.20 లక్షల మంది ఉపాధి పొందుతున్నారు. ఈ జీసీసీల్లో 50 శాతం భారత్‌లోనే ఏర్పాటు కావడం విశేషం. కృత్రిమ మేధస్సు/మెషిన్ లెర్నింగ్, అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ విభాగాల్లో భారీ వృద్ధిని నమోదవుతున్నదని ఏఎన్‌ఎస్‌ఆర్ కో-ఫౌండర్ విక్రమ్ అహుజా తెలిపారు. మొత్తం జీసీసీల్లో బెంగళూరు వాటా 30 శాతంగా ఉండగా, హైదరాబాద్ వాటా 19 శాతం, ఢిల్లీ 15 శాతం, ముంబై 12 శాతం, పుణె వాటా 10 శాతం, చెన్నై 9 శాతంగా ఉన్నాయని పేర్కొంది. ప్రస్తుతం 46 బిలియన్ డాలర్లుగా ఉన్న జీసీసీ రంగం..2030 నాటికి 110 బిలియన్ డాలర్లకు చేరుకోనున్నదని అంచనావేస్తున్నది.

## తగ్గిన విదేశీ పెట్టుబడులు

**రియల్టీలోకి జనవరి-మార్చి మధ్యకాలంలో కేవలం 11 మిలియన్ డాలర్లు**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:రియల్ రంగంలోకి విదేశీ సంస్థాగత పెట్టుబడులు తగ్గుముఖం పట్టాయి. ఈ ఏడాది జనవరి-మార్చి మధ్య కాలంలో విదేశీ పెట్టుబడిదారులు కేవలం 11 మిలియన్ డాలర్లు మాత్రమే వచ్చాయని అంతర్జాతీయ ప్రాపర్టీ కన్సల్టెన్సీ వెస్టిన్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో వచ్చిన 791.4 మిలియన్ డాలర్లతో పోలిస్తే 99 శాతం తగ్గాయని పేర్కొంది. మొత్తంగా ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్ట్‌మెంట్లు 552 మిలియన్ డాలర్లు వచ్చాయి. ఏడాది క్రితం ఇదే సమయంలో వచ్చిన 1,238.3 మిలియన్ డాలర్ల(1.23 బిలియన్ డాలర్లు) కంటే ఇది 55 శాతం తగ్గాయి. జనవరి-మార్చి మధ్యకాలంలో 541.1 మిలియన్ డాలర్లు దేశీయ ఇన్వెస్టర్లు నిధులు చొప్పించారు. రియల్ ఎస్టేట్ రంగంపై దేశీయ పెట్టుబడిదారులు ఆశాభావంతో ఉండటంతో భారీగా నిధులు కుమ్మరించారని వెస్టిన్ సీఈవో శ్రీనివాస్ రావు తెలిపారు. కానీ, అంతర్జాతీయ దేశాల్లో అనిశ్చిత పరిస్థితులు నెలకొనడం, ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతుండటంతో విదేశీ పెట్టుబడిదారులు ఇక్కడ పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజవేస్తున్నారన్నారు.

- కమర్షియల్ విభాగంలోకి(ఆఫీస్, రిటైల్, కో-వర్కింగ్, ఆతిథ్యరంగ ప్రాజెక్టులు) అత్యధికంగా 231.6 మిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు వచ్చాయి. ఏడాది క్రితం వచ్చిన 484.8 మిలియన్ డాలర్లతో పోలిస్తే సగానికి సగం పడిపోయాయి.
- రెసిడెన్షియల్ ఆస్తులు 33 శాతం తగ్గి 337.7 మిలియన్ డాలర్ల నుంచి 225 మిలియన్ డాలర్లకు పడిపోయాయి.
- ఇండస్ట్రియల్, గిడ్డంగులు రంగంలోకి కేవలం 58.9 మిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చాయి. ఏడాది క్రితం వచ్చిన 215.8 మిలియన్ డాలర్లతో పోలిస్తే 73 శాతం తగ్గాయి.
- పెట్టుబడులు ఆకట్టుకున్న నగరాల్లో బెంగళూరు తొలిస్థానంలో నిలిచింది. 299 మిలియన్ డాలర్లు వచ్చాయి. ఆ తర్వాతి ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లోకి 110 మిలియన్ డాలర్లు వచ్చాయి. మొత్తం పెట్టుబడుల్లో ఈ రెండు మెట్రో నగరాల వాటా 74 శాతంగా ఉన్నది.

Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Thigulla Krishna Murthy. Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.